* సంస్కార హీనుడు *

(కథానిక)

తన సర్వస్వమూ అరిపోయేదాకా తిరిగి తిరిగి, విసుగెత్తి ఇంటికి వొచ్చాడు కృష్ణరాజు. అతని ఈ ప్రవర్తనపట్ల అందరికీ వెగటూ అసహ్యమూ కలిగినా, కామేశ్వరికి ఒక్క రవ్వన్నా, కోపం కలగలేదంటే ఆశ్చర్యం వేస్తుంది. ఇంట్లో అందరూ కృష్ణని అనరాని మాటలు అన్నారు. తండ్రి లేనేలేడు; తల్లీ, మేనమామా, పిల్లనిచ్చిన మామా, అందరూ అతన్ని తిట్టిపోశారు. భార్య మాత్రం ఏమీ అనలేదు. నలుగుర్లోనే గాదు, అతన్ని ఒంటరిగా కలుసుకున్నప్పుడు గూడానూ. సామాన్యంగా, సంఘదృష్టిలో దుర్మార్గుడుగా పరిగణించబడ్డవాణ్ణి, భార్య ఆవిధంగానే చూడ్డం సహజమే; కృష్ణరాజు కూడా దీన్ని అంగీకరించాడు. భార్యమౌనం, అందరి తిట్లకన్నా కూడా అతన్ని ఎక్కువ బాధపెట్టింది. ఆవేళ అందరూ తిండ్లుతిని పడుకున్న తర్వాత కామేశ్వరి మొగుడి దగ్గరకెళ్ళింది మామూలుగానే. కృష్ణ, దొడ్లో మంచంవేసుకుని గాఢంగా ఆలోచిస్తున్నాడు, చీకట్లో ఊగే తులసిచెట్టువంక చూస్తో.

కామేశ్వరి అతన్ని అతి ఆప్యాయంగా చూస్తో దగ్గరకెళ్ళి కూచుంది. ఆమెస్పర్శ తగిలిన ఉత్తరక్షణం కృష్ణే నీరసంగా ఆమెవైపు తిరిగి, 'కామూ, నిన్ను ఏనాడూ, పెళ్ళయిన నాలుగేళ్ళ కాలంలోనూ, ఒక్కసారైనా ఆప్యాయంగా పలకరించి ఎరగని నన్ను నువ్వు ఇంతగా ప్రేమించి సహించటానికి కారణం ఏమిటి? నన్ను పరీక్షిస్తున్నావా? చెప్పు!' అని అడిగాడు, దోషి, న్యాయాధిపతి ముందు క్షమార్పణ వేడుకునే స్వరంతో.

కామేశ్వరి, చాలా ధీరంగా, కాని, ఆప్యాయంగానూ, దయగానూ, 'అదికాదండీ. మీరు చేసినపనులు ధైర్యంవున్న ప్రతివాడూ, ప్రతి ఆడదీ చేస్తుందని నేను నావరకూ గట్టిగా విశ్వసించాను. అంతకన్న ఇందులో ప్రత్యేకంగా నవీనమేమీ లేదు. మీరు నన్ను చూసి ఎందుకు భయపడుతున్నారో నాకర్థం కాదు.' అన్నది.

కృష్ణ నిజంగా ఉలిక్కిపడ్డాడు. అతనికి గత జీవితం అంతా ఒక్కసారిగా జ్ఞాపకమొచ్చింది. అతనికి తను చేసిన పన్లు, తనకే తప్పుగా తోచినయి ఇదివరకు. అందుకల్లనే అందరి తిట్లనీ భరించి ఊరుకున్నాడు. ఇప్పుడు కామేశ్వరి ఏమిటి ఇట్లా మాట్లాడుతోంది?—నిజంగా తను చేసినవన్నీ ధైర్యవంతుడైన ఓవ్యక్తికి సహజమూ న్యాయమూనా? కృష్ణ, కామేశ్వరి జడ చాలా అనురాగంతో సర్దుతో, 'నువ్వు చాలా కొత్తగా మాట్లాడుతున్నావు; నేను ఇలాంటి భావాన్ని ఎదురు చూడలేదు నీనించి. అందువల్ల భారపడ్డాను. నువ్వనేది నిజమా?' అని అడిగాడు.

కామేశ్వరి, అతన్ని ఓ రకంగా చూసింది ఆ చీకట్లో. 'నిజమా అంటారా? కాక మరేమిటి? నేనన్నది నిజమే. ఎలాగా అంటే కారణాలు చెప్పలేను. నాకున్న కొద్దిపాటి తెలివితో ఆలోచించి ఈనిర్ణయానికి వొచ్చాను. మీరు మీ తాలూకు డబ్బుని, శక్తిని, చాలా త్వరగా ఖర్చుపెట్టారు. అందులో మీ లోపంకన్న పరిస్థితుల లోపం ఎక్కువగా వున్నది. ఏ జీవితానుభవమూ లేని స్తబ్ధు అయిన మొగుడితో, నిరామయంగా వందేళ్ళు గడపటంకన్నా మీబోటి వారితో, ఒక్క ఏడాది గడపటం నాకు చాలా ఇష్టం." అన్నది.

ఆమె చెప్పేవన్నీ అతన్ని ప్రోత్సాహపరచినై. ఆమెలో ఇంతసంస్కారం వుంటుంది అని ఇదివరలో తను ఊహించి ఉండలేదు.

"గంధర్వుడు"

భారత పతివ్రతలాగా, చాటున, దేవుళ్ళని 'నా భర్తని బాగుచెయ్యండి. వాడు దుర్మార్గుడు; కాని నా భర్తేసుమా' అని ఆమె వేడుకోకుండా, తనని, అటు దుర్మార్గుడిగానూ కాకుండా, సన్మార్గుణ్ణిగా కాకుండా, వొట్టి మనిషిగా మాత్రమే స్వీకరించి వూరుకో గలగటం, అతన్ని శాంతింప చేసింది. అతను లోలోపల, ఓ ప్రమాణం చేసుకున్నాడు. ఇక, తను ఏ పరాయి స్త్రీని ముట్టుకోకుండా, తాకకుండా సద్బుద్ధి కలిగివుండాలి' అని. గత పదిరోజుల బాధను తిరస్కారాల మోతనించి, ఆ రాత్రి అతను తన భార్య చేతుల్లో శాంతిగా చిన్న పిల్లవాడల్లే నిద్రపోయినాడు.

* * *

కృష్ణరాజు తాలూకు ఆస్తి యావత్తూ ఆరి పోయినా, వాడిమీద ప్రేమకొద్దీ వచ్చిపోతూ పినతల్లి రాసిచ్చిన ఆస్తితో, అతను మళ్లీ కోలు కున్నాడు ఆర్థికంగా. సహజంగా అతనితో ఎప్పటివలెనే ప్రవర్తిస్తోంది కామేశ్వరి. వస్తుతః ఆమె స్వాతంత్ర్యవాది. ఇతరుల స్వాతంత్ర్యాన్ని అరికట్టడం కాని, తన స్వేచ్ఛకు ఇతరులు అడ్డం రావడం కాని ఆమెకు తల నెప్పిగా వుండేది. ఈ గుణం, చదువుతోనే గాక, ఆమెకు పుట్టుక నించే వొచ్చివుండాలి. ఆమె అందగత్తె. వొయ్యారం వొలకపోస్తూ వుండేది ఆమె ప్రతి చర్యా. మితభాషిణి కావడం ఆమెకొక ప్రత్యేక ఆకర్షణగా పరిణమించింది. కృష్ణ ఈ భార్యను వొదిలి ఇన్నేళ్లూ, దరిద్రగొట్టు ముండలతో కాలం గడిపినందుకు. చాలా పశ్చాత్తాప పడ్డాడు. ఆమెను ప్రత్యక్షంగా కాకపోయినా, పరోక్షంగా చాలా మాట్లు క్షమార్పణ వేడుకున్నాడు, అతని బలహీనత కొద్దీనూ. అతని కింకా మానవ జీవితం, గీట్లలో గోడల్లో ఇరుకుగా వుండ జాలదని, ప్రతిక్షణం, సమాజ నిర్మిత నీతి చట్టాల్ని వ్యతిరేకిస్తూనే వుంటుందనీ, తెలీదు. తన భార్య గొప్పది కావటం వల్లనే తనని సహించిందనే అతని వుద్దేశం. ఈ గొప్పదనాన్ని అతను గుర్తించి నప్పణ్ణించీ, భార్యని, సుగుణరాశిగా, వెనకటి పతివ్రతల లిస్టుకే చేర్చి పూజించ సాగాడు. ఆమె అతని మనస్సులో అత్యున్నతస్థానం ఆక్రమించింది. కామేశ్వరి దీన్నేమీ గమనించలేదు; తన భర్తకి తన మీద ఏర్పడ్డ గౌరవాన్ని పెంచటానికి ఆమె ఎట్టి ప్రయత్నమూ చెయ్యలేదు. అతన్ని సహజంగా ప్రేమించింది. అంతవరకే. అట్లానే రోజులు దొర్లిపోతున్నాయి.

* * *

ఒకరోజు కామేశ్వరి చీకటి పడ్డాక ఎక్కడికో పోవటానికి బయల్దేరింది. ఇంట్లో మరెవ్వరూ ఆమెని అడ్డగించరు. ఒక్క కృష్ణరాజే ఆమెని అడ్డగిస్తే. అప్పటికే చాలామాట్లు ఆమె అట్లా చీకటి పడ్డాక ఎక్కడికో పోవటం, పొద్దుపోయి రావటం కృష్ణరాజు గమనిస్తూనే వున్నాడు. ఆమె మీద గౌరవం కొద్దీ వూరుకున్నాడు ఇన్నాళ్లూ కారణమన్నా అడక్కుండా. కాని ఇవాళ ఆమెను కారణం అడిగే ధైర్యం లేక, ఆమెని వెంబడించి, ఆమె ఎక్కడికి పోతుందో కనుక్కోవాలని నిర్ణయించుకున్నాడు కృష్ణరాజు. ఆమె గడప దాటగానే, చల్లగా తనూ వెంబడే వెళ్ళాడు.

ఆమె సరాసరి పార్కురోడ్డేపోయి ఓ చిన్న ఇంట్లోకి వెళ్లింది. కృష్ణరాజు లోపలికి వెళ్ళక చుట్టూ తిరిగి దొడ్లోకి వెళ్ళి, పూరిల్లు కావటం వల్ల, తడికె సందులోగుండా లోపలికి చూశాడు. లోపల ఎవరో ఒక అమ్మాయి, ఒకతను నుంచుని కామేశ్వరిని నమ్రతగా ఆహ్వానిస్తున్నారు. కృష్ణరాజుకి చెవులు చురుకుగా పనిచెయ్య సాగినై.

మసకగా వెలుగుతున్న లాంతరు వెలుగులో, కామేశ్వరి మొహం వెలవెల పోతున్నది. ఆమె ఏడుస్తుందేమో అనిపిస్తోంది. ఆమెకీ ఆ దంపతులకీ అయిదారు గజాల దూరంలో ఓ ఆరేళ్ళ అందమైన కుర్రాడు కూచుని వున్నాడు. బెదురు చూపులు చూస్తున్నాడు. కామేశ్వరి అమ్మాయి కేసి చూస్తో: 'అమ్మా! మీ ఋణం తీర్చలేను. అబ్బాయికి ఈ రూపాయి ఇవ్వండి. వాడికి ఏ లోటూ రానివ్వకండి' అని, ఆ కుర్రాడి దగ్గరగా వెళ్ళి, 'రా నాన్నా. నీకు మంచి చొక్కా తెచ్చాను' అని ఎత్తుతుంది కుర్రాణ్ణి.

కుర్రాడు నిర్ఘాంత పోయినా, ఆమెని ఆ రెండు మూడు నిమిషాలకల్లా గుర్తుపట్టి సిల్కు చొక్కాయేనా? అంటూ ఆమె చేతిలో చొక్కా లాక్కుని, 'బావుంది బావుంది' అని

చంకలెగరేస్తే, ఆమెని గట్టిగా కావలించుకున్నాడు.

లోపల నుంచునివున్న అతను, 'ఋణమేముందమ్మా, ఇందులో, అబ్బాయి డబ్బులు అబ్బాయికే ఖర్చు పెడ్తున్నాం. ఇందులో మాలో దయే ముందండి!' అన్నాడు చాలానమ్రతగా.

కృష్ణరాజుకి అర్థం కానిదేదో విషయం గొంతులో వెలక్కాయల్లే పడి ఊపిరాడనియ్యడం లేదు. అతనిలో ఒక విపరీతమైన సందేహం పట్టుకుంది. అది నిజమా? ఆ కుర్రాడిలో తన భార్య పోలికలు అగుపించడం తన పొరపాటా? ఈ నాటకం ఏమిటి? తనకి తెలీకుండా తన భార్యకి పిల్లాడా?

అతనిబుర్ర ఆలోచించడం మానివేసింది. కారణం కామేశ్వరి అక్కణ్నుంచి బయల్దేరి బయటికి వెళ్ళిపోవటమే. ఏమిటో ఈ రాత్రే తేల్చుకుందామని కృష్ణరాజు, గబగబ నడచి వెళ్ళాడు. అతని నడకా ఆవేశం ఆ నిమిషాన అటూ ఇటూ ఆలోచించలేని తాగుబోతుని జ్ఞప్తికి తెచ్చింది.

భార్యా, భర్తా, ఇంటి గడపదగ్గిరే తారసపడ్డారు. ఒకరు తీరని ఆవేదనతో — మరొకరు, అత్యంతావేశంతో. కృష్ణరాజు చాలా ఆవేశంతో కామేశ్వరిని గడపలోనే కట్టుకుని ఆగి, 'ఈ నాటకం ఏమిటండి, కామేశ్వరి గారూ!' అన్నాడు.

కామేశ్వరి, చాలా అధైర్యపడింది ఆ క్షణాన; తన భర్త ఈ రకంగా, తనని అడగడం ఇదే మొదటిసారి. కాని మరుక్షణమే ధైర్యం తెచ్చుకుని, 'లోపలికి పోనివ్వండి ముందు; తీరికగా మాట్లాడదాం,' అంటూ అతన్ని విదిలించుకుని చరచరా లోపలికిపోయింది. కృష్ణరాజు, నిస్తబ్ధుడై మెల్లగా ఆమెని అనుసరించాడు. రెండడుగులు వేసేప్పటికి, అతనిలో అగ్ని రగులుకుంది; గబుక్కున తన గదిలోకి వెళ్ళి, తనెన్నడో కొన్న చాకు పంచెలో తుడిచి, తీసుకుని, కామేశ్వరికోసంవెదుక్కుంటూ ఆమె గదిలోకి వెళ్ళాడు. ఆమె గదిలో కిటికీ దగ్గిరగా నుంచునివుంది బైట అప్పుడే ఉదయిస్తున్న చంద్రుణ్ణి నీరసంగా చూస్తో.

కృష్ణరాజు ఆమెదగ్గిరకి అత్యుద్రేకంతో పోయి ఆమె జుట్టు ఒక చేత్తో పట్టుకుని, చాకుని, గుండెల్లో గురిపెట్టి, 'చెప్పు, ఆ కుర్రాడెవడో, వాడికి నీకూ ఏం సంబంధమో' అన్నాడు.

పరిస్థితిని అర నిమిషంలో అర్థం చేసుకుంది కామేశ్వరి. ఆమె తన భర్త సంస్కారాన్ని అదివరకల్లా తప్పుడు అంచనా వేసింది. అతను ఇంత బలహీనుడని ఆమె కిప్పుడే తెలిసింది. ఇప్పుడు అధైర్యపడడంవల్ల జరిగేది, తనకి అన్యాయమేగాక, అపజయం కూడానూ.

'ఆగండి. ఉద్రేగ పడకండి. మీరు నన్ను పెళ్ళి చేసుకున్న తర్వాత, నన్ను నాగరికి వొదిలి నాలుగు సంవత్సరాలు ఎవరితోనో సుఖిస్తే, నే నేమీ మాట్లాడలేదు. అందులో మానవ సహజం ఉన్నదని భావించి వూరుకున్నాను. మీరు - నన్ను ఏమీ అర్థం చేసుకోకండానే నాకు హాని చెయ్యటానికి ప్రయత్నిస్తున్నారు. కానీండి' అంది ఆమె జారిపోతున్న ధైర్యాన్ని కూడదీసుకుంటో.

కృష్ణరాజు వస్తుతః అధైర్యవంతుడు. అతను దుర్మార్గం చెయ్యగలడు గాని, ఇంకోళ్ళకి తెలిసేటట్టు ఎన్నడూ చెయ్యలేదు. ఇదివరలో చెయ్యలేదు కూడానూ. భార్యని ఊరికే బెదిరించటానికే చాకు తెచ్చాడు గాని పొడవటానికి కాదు. అతను కోపంతోనే, 'వెధవ వుపన్యాసం చెప్పావుగాని, ఆ పిల్లవాడెవరో చెప్పు ముందు. లేకపోతే' అన్నాడు, పొడిచేవాడికిమల్లే, కత్తి వొణికించి. కాని చెయ్యి భయంతో సగం తనే వొణుకుతోంది.

కామేశ్వరికి ఈసంగతి కొద్దిగా తెలిసింది. ఆమె ఇంకా ధైర్యంగా, 'పొడిస్తే పొడవండి. జరిగింది చెప్పేస్తాను. మీరు ధైర్యవంతులనీ, ఇతరుల తప్పులని, మానవసైజంగా అంగీకరించే సంస్కారం మీకుందనీ నేను భావించాను. కాని మీరింత పిరికివారనీ, కనకనే ఆవేళ నా క్షమార్పణకోసం అంత తాపత్రయపడ్డారనీ ఇప్పుడు తెలుస్తోంది. నేను స్కూలులో చదువుతుండగా ఒకతను నన్ను ఒకరోజు పరిస్థితుల అనుకూలతని అందగా చేసుకునీ, నా చిన్నతనపు అజ్ఞానాన్ని పురస్కరించుకునీ, అనుభవించాడు. దాని ఫలి

తంగా, గర్భవతయినాను. నా స్నేహితులు నాకు ఈవిషయంలో సహాయంచేసి, ఆపిల్లవాణ్ణి ఇందాక మీరు చూసిన దంపతులకి ఇచ్చివేశారు. అనుగ్రాడంటే నాకు చాలా మమకారం వుంది, ఆతని పోషణిని ఇన్నాళ్ళబట్టీ నేనే భరిస్తూవచ్చాను. ఇకముందు భరిస్తాను. ఇది, మన పెళ్ళికాకముందు సంగతి. అప్పుడు ఆకస్మాత్తుగా జరిగిన దురదృష్టానికి నన్ను ఇవ్వాళ మీరు సంజాయిషీ అడిగేట్టయితే- నేనేమీ చెప్పలేను. నేను ఇంకొకర్ని దేనికోసమూ సంజాయిషీ అడగను. ఇంకొకరు నన్ను దేనికోసమూ సంజాయిషీ అడగటం అనవసరం' అని తెగేసి చెప్పింది.

కృష్ణరాజు, కోపావేశంతో, కత్తి కిందికి విసరిపారేశాడు. 'ఉద్ధరించావు — లం...నిన్ను ఖూనీచేసి ఆ స్త్రీ హత్య ఎక్కడ మొయ్యను. పో- ఈ ఇంటోనుంచి; నీ పిల్లాడి దగ్గరకో, నీ రంకుమొగుడి దగ్గరకో—...సంసారమట- ధైర్యమట—...' అంటో, ఆమెని వాకిలిదాకా ఈడ్చుకొచ్చి, రోడ్డుమీదికి నెట్టి తలుపేసుకున్నాడు నిశ్చింతగా.

కామేశ్వరి, ఏమీ ఆశ్చర్యపడకండా, ఆవేశపడకండా, అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

నడిరాతిరి నల్లమేఘాలు

యం. హీరాలాల్ రాయ్

భారతదేశ విభజనమూలంగా లక్షలాది ప్రజలు దుర్భరావస్థల పాలయ్యారు. లక్షల సంఖ్యలో ప్రజలు మృత్యుదేవతకు ఆహుతి అయ్యారు. అంతకు రెండు రెట్లమంది దారిద్ర్యంలో మునిగిపోయారు. సుందరమైన భవనాలలో నివసిస్తూ వెండి పళ్లాలలో భోంచేయడానికి అలవాటుపడ్డ సంపన్నవంతులంతా, దమ్మిడీలేని దద్దమ్మలుగా మారిపోయారు. సీతావు తల్లికన్న మిన్నగా తమ శీలాన్ని కాపాడుకున్న మగువలు, రొట్టెముక్క కోసమై లొంగిపోయారు. భారత చరిత్రలో అంతటి లజ్జావిహీనమైన సంఘటన ఎప్పుడూ జరిగివుండలేదనే చెప్పాలి.

1947 సంవత్సరంలో జరిగిన ఆ సంఘటనను ఎప్పుడూ మరిచిపోలేను. జనాభామార్పిడిమూలంగా మేము అన్నివిధాలా సన్యాసులమయ్యాం. పైగా, దారుల మధ్య బందిపోటు దొంగలు మమ్మల్ని ఇంకా సర్వనాశనం చేశారు. తమ సుందర భవనాలముందు, ఏనుగులను అల్లారు ముద్దుగా పెంచిన సంపన్నవంతులు, నేడు దిక్కులేని కుక్కలమాదిరి, ఎంగిలి రొట్టె ముక్కలకు కూడా లొంగిపోయారు. దిక్కులేని ఈ లక్షలాది సంతానం. ఢిల్లీనగరం చేరుకుంటుందన్న వార్త విని వర్తకులు చంకలెగరేశారు. వీలున్నంత వరకూ అధికలాభాలు గడించవచ్చునే ఆశతో అసంఖ్యాకంగా వర్తకులు ఢిల్లీ చేరుకున్నారు.

అసంఖ్యాకులైన ఈ బాధితులందరూ, ఢిల్లీ నగరంమీద, పరిపూర్ణమైన ఆశలు పెట్టుకున్నారు. 'ఢిల్లీలాంటి నగరంలో, ఆకలికి ఆహుతి అయ్యేవాడుండడు. అంతా అన్నపూర్ణమ్మలే వుంటారు' అని భావించారు. నెహ్రూ, పటేల్ రాజేంద్రప్రసాద్, జయప్రకాశ్‌లాంటి మహానేతలు నివసించే నగరంలో, ఆకలి సమస్యే వుండదు; పేదలపాలిటి పెన్నిధి గాంధీ మహాత్ముడుకూడా అక్కడే వుంటాడు. కాబట్టి అక్కడ మా ఆకలి సమస్యే వుండదని వారు ఊహించారు. కాని, పాపం వారి ఆశలన్నీ ఆవిరిలాగా ఎగిరిపోయినై. గాంధీ, నెహ్రూ మాటలు వినేవాళ్లెవరు? వీరి ఉపన్యాసాలంటే ప్రజలకు అకస్మాత్తుగా అజీర్ణం పుట్టుకొస్తుంది. ఈ ఉపన్యాసాలు మేతపెట్టవని వారికి నమ్మకం ఏర్పడిపోయింది. పైగా, వీళ్లకు ఈ ఉపన్యాసాలంటే చికాకుగూడా. ఢిల్లీ సందుగొందుల్లోనూ, పేవ్‌మెంట్లమీదనూ, జన సమ్మర్దం పెరిగి